క్లుప్తంగా

నేడు మండల ప్రత్యేక సమావేశం

షాద్‌నగర్‌టౌన్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్ అధ్యక్షతన నేడు(శుక్రవారం) ఉదయం 9:30 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వినయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశానుసారం 2023–24 సంవత్సరానికి బీపీడీపీ వార్షిక ప్రణాళిక తయారు చేయుట, జాతీయ పంచాయతీ అవార్డ్స్, అభినందన సభ నిర్వహించుటకు చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సమావేశానికి మండల పరిధిలోని గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, మండలస్థాయి అన్ని శాఖల అధికారులు సకాలంలో విధిగా హాజరు కావాలని కోరారు.

గర్భిణులకు పోషకాహారం పంపిణీ



పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్న రవీందర్‌రెడ్డి

కొత్తూరు: మండల పరిధిలోని కొడిచర్ల గ్రామంలో గురువారం పోషణ్‌పక్వాడలో భాగంగా స్థానిక ఎంపీటీసీ గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఆయనతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహార ఆవశ్యకతపై వారికి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ఆరోగ్యవంతమైన సమాజస్థాపన కోసం వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది నాగలక్ష్మి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

శంకర్‌పల్లి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని లక్ష్మారెడ్డిగూడలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.8లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌లు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం సీసీరోడ్లు, అండర్‌డ్రైనేజీ సమస్యలు లేకుండా చూసేందుకు పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ సునితగోపాల్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేపర్లు లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు

అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్ డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

షాద్‌నగర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాలు లీక్ చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీక్‌ను నిరసిస్తూ గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహేష్ మాట్లాడుతూ.. నిరుద్యోగులు ఎంతో శ్రమించి పరీక్షలకు సిద్ధమై పరీక్షలు రాశారని అన్నారు. పేపర్ లీక్ అయ్యాయని వార్తలు రావడంతో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులు ఎంతో నిరాశకు గురయ్యాయని తెలిపారు. ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యం వల్లనే ప్రశ్నాపత్రాన్ని లీక్ చేశారని చెప్పారు. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, జ్యోతి, రజిత పాల్గొన్నారు.

84 మంది విద్యార్థులు గైర్హాజరు

షాద్‌నగర్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం గణితం పేపర్ 2, జువాలజీ, హిస్టరీ పరీక్షలు జరిగాయి. షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఏడు పరీక్షా కేంద్రాల్లో 1907 మంది విద్యార్థులకు గాను 1823 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 84 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ పరీక్షల కస్టోడియన్ అధికారులు శ్రీకాంత్, కిష్టప్పలు తెలిపారు.

రహస్య పరిశీలన ఎందుకు?

- పరిశ్రమను రహస్యంగా సందర్శించిన అధికారుల బృందం
- మీడియాను అనుమతించని పరిశ్రమ ప్రతినిధులు
- గంటల తరబడి మంతనాలు
- డిజైన్ చూడటానికి వెళ్లామన్న ఆర్డీఓ



పరిశ్రమలో అధికారులు

నందిగామ: మండల పరిధిలోని మేకగూడ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ఓ పరిశ్రమను అధికారుల బృందం గురువారం రహస్యంగా సందర్శించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో పాటు సర్వేయర్ ఈ పరిశ్రమను సందర్శించారు. సుమారు 2 గంటల పాటు పరిశ్రమలోనే ఉన్న అధికారులు ఎందుకోసం వెళ్లారు.. అనే వివరాలను వెల్లడించేందుకు గోప్యత పాటిస్తుండడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

డిజైన్ చూడటానికి వెళ్తారా!

పరిశ్రమ ప్రతినిధులు పిలిస్తే డిజైన్ చూడటానికి వెళ్లానని షాద్‌నగర్ ఆర్డీఓ రాజేశ్వరి చెప్పడం విడ్డూరంగా ఉంది. ఓ ప్రైవేట్ పరిశ్రమ ప్రతినిధులు డిజైన్ చూయించడానికి ప్రభుత్వ అధికారులను ఎందుకు పిలుస్తారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆర్డీఓ రాజేశ్వరి, తహసీల్దార్ రహ్మాన్ ఖాన్, ఆర్ఐ రోజా, ఇరిగేషన్ అధికారులు కార్తీక్, రవీందర్‌రెడ్డి, సర్వేయర్ భీమ్లానాయక్‌లు డిజైన్ చూడటానికి వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందనే ప్రశ్నలు పలువురు సంధిస్తున్నారు. పరిశ్రమ డిజైన్‌కు ప్రభుత్వ అధికారులకు సంబంధం ఏమిటో అంతుచిక్కని మిస్టరీగా మారింది.

మీడియాపై రుసరుస

అధికారుల బృందం నిర్మాణంలో ఉన్న పరిశ్రమను సందర్శిస్తుందనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లిన మీడియా ప్రతినిధులను పరిశ్రమ ప్రతినిధు లు, సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. అధికారు లు ఇక్కడకు వచ్చారనే విషయం మీకెవ్వరు చెప్పా రని మీడియా ప్రతినిధులపై దురుసుగా ప్రవర్తించారు.

తుంగకుంట పరిశీలనకేనా..

పరిశ్రమ నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో నక్షా బాటలు కబ్జాకు గురైయ్యాయని, తుంగకుంట శిఖం భూమిలో అక్రమ కట్టడాలు జరుపుతున్నారనే విషయంపై ఆరా తీసేందుకు, శిఖం భూమిలో గతంలో వేసిన రోడ్డు పరిశీలన కోసం అధికారులు అక్కడికి వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పాటు కల్వర్టు నిర్మాణానికి సంబంధించి పరిశీలన సైతం చేసినట్లు తెలిసింది.

ఆర్డీఓ ఏమన్నారంటే ..

ఈ విషయమై షాద్‌నగర్ ఆర్డీఓ రాజేశ్వరిని ఫోన్‌లో వివరణ కోరగా పరిశ్రమ నిర్మిస్తున్న వారు డిజైన్ చూడాలని కోరగా కేవలం డిజైన్ చూడటానికి వెళ్లామని చెప్పారు. తుంగకుంటకు సంబంధించి ఏమైనా సర్వే చేశారా అని ప్రశ్నించగా మీటింగ్‌లో ఉన్నానని చెప్పి ఫోన్ కట్ చేయడం కొసమెరుపు.

ఎమ్మెల్యేపై వ్యక్తిగత ఆరోపణలు తగవు

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి

కేశంపేట: ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన ఎల్లనమోని మదనమోహన్ సోషల్‌మీడియాలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన పోస్టు చేశాడు. గురువారం మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రానికి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులను ప్రజలు ఆదరించడం లేదన్నారు. ప్రజల్లో తమకు ఆదరణ రావడం లేదనే సాకుతో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, వారి కుటుంబ సభ్యులపైన వ్యక్తిగత ఆరోపణలు చేయిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విశ్వనాథం, వేణుగోపాలచారి, శ్రీహరి, నవీన్‌కుమార్, మల్లేష్‌యాదవ్, యాదయ్య, అంజిరెడ్డి, నారాయణరెడ్డి, మురళీమోహన్, దశరథ, యాదగిరిరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



సర్పంచులకు పురస్కారాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కొత్తూరు: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులకు ప్రజలు, యువత సహకారం అందించాలని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసిన పలువురు సర్పంచులకు స్థానిక జెడ్పీటీసీతో కలిసి పురస్కారాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పురస్కారాలు పొందిన పంచాయతీలను ఆదర్శంగా తీసుకొని మిగతా సర్పంచులు తమ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పన జరిగినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు, ఎంపీఓ నర్సింలు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

పోరాటయోధుల త్యాగాలు మరువలేనివి

ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌చారి



షాద్‌నగర్: నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

షాద్‌నగర్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన పోరాట యోధుల త్యాగాలు మరువలేనివని ఏఐఎస్‌ఎఫ్ షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌చారి అన్నారు. గురువారం పట్టణంలోని బీసీ గురుకుల హాస్టల్‌లో మహనీయులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌చారి మాట్లాడుతూ... తెల్లదొరలను తరిమికొట్టి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు పోరాటం చేశారని అన్నారు. ప్రజలందరిని చైతన్య పరుస్తూ ప్రాణాలకు తెగించి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. వీరిని బ్రిటీష్ పాలకులు ఉరితీశారని అన్నారు. ఉరికంభం ఎక్కుతున్నామని తెలిసినా వారు ముగ్గురు ఎలాంటి ఆందోళన చెందకుండా దేశం కోసం తమ ప్రాణాలర్పిస్తామని నినదించారు. వారిని నేటి విద్యార్థులు, యువకులు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, సంధ్య, స్వప్న, మౌనిక, అనిత, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

చేవెళ్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి రాజేష్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు అల్లి దేవేందర్, ఏసు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రిన్సిపాల్ అనిత



సైబర్ నేరాలపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చేవెళ్ల: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బురాన్‌పూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనిత పేర్కొన్నారు. మండలంలోని ఊరేళ్ల సమీపంలో గల సాగర్ ఇంజనీరింగ్ కళాశాలలో 'సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫారం' అనే కార్యక్రమం, సైబర్ నేరాలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సర్పంచ్ జహంగీర్, ఉప సర్పంచ్ విఠలయ్యలు హాజరయ్యారు. గ్రామంలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని గ్రామంలో ర్యాలీ చేస్తూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ.. సైబర్‌మోసాలతో ఎంతో మంది ప్రజలు మోసపోతున్నారని తెలిపారు. పెరుగుతున్న టెక్నాలజీతో ఎంత ఉపయోగం ఉందో అంతే నష్టం కూడా జరుగుతుందని చెప్పారు. టెక్నాలజీని మంచి పనులకే ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రజలకు సైబర్‌నేరాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో గురువారం కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఉన్నాయా అని విమర్శించారు. రైతులకు ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా పథకాలు దేశానికి ఆదర్శమన్నారు. ఇక కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి పథకాలు ఎంతో ఆదరణ ఇస్తున్నాయని తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటి తాగునీరు అందిస్తున్నామన్నారు. అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. దళితబంధు పథకం ద్వారా రూ.10 లక్షలు ఇస్తున్నామని, గొర్రెల కాపరులకు ఉచితంగా గొర్రెలు అందించామన్నారు. ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని, పార్టీ అభ్యున్నతి కోసం సైనికుల్లా పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఈట గణేష్, జెడ్పీటీసీ స్వరూప, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, శ్రీధర్‌రెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాములు, వజ్రలింగం, స్వామి, ప్రేమ్‌కుమార్, శివ, బాల్‌రాజ్, గోపాల్, సత్యప్రమోద్‌రావు, రాములు, వెంకటేష్, జబ్బార్, నర్సింగ్‌రావు, దూలయ్య, శేఖర్ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

సెర్ప్ ఉద్యోగుల వేతన పేస్కేల్ పెంచడంపై సంతోషం వ్యక్తం చేస్తూ గురువారం చౌదరిగూడలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి వారు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎంలు రామస్వామి,యాదగిరి, సీసీలు రమేష్, దేవయ్య, స్వర్ణలత, స్వరూప,మండల మహిళ సంఘం అధ్యక్షురాలు మంజుల, మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రధాని మోదీ



బీజేపీ నాయకుడు బోజ్జయ్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, అవినాశ్‌రెడ్డి



షాబాద్: సర్పంచులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, అవినాశ్‌రెడ్డి తదితరులు

షాబాద్: ప్రధాని మోదీ ప్రజాసంక్షేమాన్ని విస్మరించి, ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బతీసి దేశసంపదను దోస్తులు అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆరోపించారు. గురువారం మండల పరిధిలోని మక్తగూడ గ్రామంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అధ్యక్షతన 10 గ్రామ పంచాయతీలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకమ్మగూడ బీజేపీ సీనియర్ నాయకులు బోజ్జయ్య ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీకి చెందిన నాయకులను నిలదీయాలన్నారు. దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కేంద్రంలోని మోదీ సర్కార్ అడ్డుకుంటుందన్నారు. ఎంపీపీ ప్రశాంతిరెడ్డి, జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డిలు మాట్లాడుతూ.. అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. భేదాభిప్రాయాలతో ఇప్పటి వరకు దూరంగా ఉన్న వారిని సైతం కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా లీగల్ అడ్వైజర్ పీసరి సతీష్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్లు వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేష్, ఎంపీటీసీలు పార్వతమ్మ, సునిత, సర్పంచ్‌లు కృష్ణగౌడ్, పాండురంగారెడ్డి, రాములు, శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

గ్రామాభివృద్ధికి సర్పంచులు నిరంతర కృషి

గ్రామాభివృద్ధిలో సర్పంచులు కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల సర్పంచులకు, ఎంపీటీసీలకు, కార్యదర్శులకు జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ ప్రశాంతిరెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మితో కలిసి అవార్డులను అందజేసి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి సర్పంచ్‌లు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ అవార్డులే కాకుండా నేషనల్ అవార్డులకు ఎంపిక కావాలని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. సంపూర్ణ పారిశుద్ధ్యం కోసం అందరూ కృషి చేయాలని తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేసి డబ్బాల్లో వేయాలన్నారు. ప్రతి ఇంటికి తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఇతర రాష్ట్రాలు సైతం మనవైపు చూస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, ఎంపీడీఓ అనురాధ, ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, ఎంఈఓ శంకర్‌రాథోడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

కళలతో మానసికోల్లాసం

స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల



నాటకం ప్రారంభోత్సవంలో పాల్గొన్న విశాల

కేశంపేట: అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, కళల ద్వారా మానసిక ప్రశాంతత కల్గుతోందని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో బుధవారం రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకాన్ని పునఃప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాల గ్రామస్తులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలన్నారు. నాటకల పట్ల గ్రామస్తులు చూపిన మక్కువ అభినందనీయమన్నారు. ఈ ప్రదర్శనకు గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, రాంచందర్, సుందరయ్య, జహంగీర్, లక్ష్మయ్య, జంగయ్య, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, ఫకీరయ్యగౌడ్, సుధాకర్, శేఖరయ్య, రవీందర్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి



మోకిల సర్పంచ్ సుమిత్రను సన్మానిస్తున్న ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్

శంకర్‌పల్లి: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు ఎంతో శ్రద్ధ వహిస్తున్నారని ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన గ్రామాల సర్పంచ్‌లను ఎంపీపీ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో సర్పంచ్‌లు ముఖ్యపాత్ర పోషించడం జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డులు, గ్రామ సంతలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రజలు కూడా పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పాపారావు, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, ఎంపీఓ గీత, ఏపీఎం బీమయ్య, పీఓ నాగభూషణం, ఉప తహసీల్దార్ ప్రియాంక, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికులకు హెల్త్‌కిట్ల పంపిణీ



హెల్త్‌కిట్లను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య హెల్త్‌కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికుల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ఉచితంగా గ్లౌజులు, సబ్బులు, మాస్కులతో పాటు పలు వస్తువులను సరఫరా చేస్తుందన్నారు. సిబ్బంది విధుల్లో భాగంగా జాగ్రత్తలు పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని సూచించారు. తనవంతుగా కార్మికులకు సహాయం చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వీరేందర్, వైస్‌చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు చంద్రకళ, ప్రసన్నలత, నాయకులు దేవేందర్‌యాదవ్, రాజేందర్‌గౌడ్, యాదయ్య, నర్సింహా, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

ఎంపీపీ రవీందర్ యాదవ్



అవార్డును అందజేస్తున్న ఎంపీపీ, విశాల

కేశంపేట: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ రవీందర్ యాదవ్ అన్నారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో గురువారం ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం రవీందర్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు అండర్‌డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు అందించాలని ఆయన కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ఇంటింటికి తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. అనంతరం జాతీయ పంచాయతీ రాజ్ అవార్డులను పొందిన గ్రామ పంచాయతీలకు అందజేస్తున్నారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల, వైస్ ఎంపీపీ అనురాధ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎఈ పంచాయతీరాజ్ భూపాల్, మండల ఇన్‌చార్జి విద్యాధికారి మనోహర్, ఏపీఓ అజీజ్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.